తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

గురువారం 05 మార్చి 2026

పేజీలు : 8




# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో వసతి, సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం బాలికల రెసిడెన్షియల్ కళాశా లను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ లోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్,కిచెన్ షెడ్, లైబ్రరీ, కలెక్టర్ పరిశీలించారు.కిచెన్ రూమ్ లో విద్యార్థులకు వడ్డించుటకు తయారుచేసిన భోజనం, పప్పు, కూరలు, సాంబారు పరిశీలించారు, కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు. వంట సామాన్లు, కూరగాయలు వెలుతురు తగిలే విధంగా పైన టేబుల్ మీద ఉంచుకోవాలని అన్నారు.డైనింగ్, వాష్ ఏరియా ఎప్పుడు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కళాశాలలో ఫిర్యాదులు బాక్స్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ ను



ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రాజెక్టుల భూసేకరణకు రూ.5000 కోట్లు

- సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు
- త్వరలోనే స్వయంగా డ్యామ్‌ను సందర్శిస్తా
- పాలెంవాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష

వార్తా మెయిన్ పేజీలో



## బైక్ పై నుంచి పడి వ్యక్తి మృతి

**చిలుకూరు,బుధవారం 04(జనంసాక్షి):** బైక్ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిలుకూరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే సీతారాంపురం గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (29) అనే ఫోటోగ్రాఫర్ బుధవారం సాయంత్రం ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం కొత్తగా నిర్మించిన రహదారి నుండి ప్రయాణిస్తుండగా మూలమలుపు వద్ద బండి అదుపుతప్పి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఒక కుమార్తె ఉన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హనుమా నాయక్ తెలిపారు.



## భద్రాచలంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల సందడి

**భద్రాచలం, మార్చి 4 (జనంసాక్షి) :** భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో మార్చి 27, 28 తేదీలలో జరగనున్న శ్రీరామ నవమి, పట్టాభిషేకం బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి పెళ్లి పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి.ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేసి పసుపు కొమ్ములను దంచి కళ్యాణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తరువాత నిత్య కళ్యాణ మండపంలో స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కళ్యాణ తలంబ్రాలు కలపడానికి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుల దంపతులు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ, ఈవో దామోదర్ రావు దంపతులు పాల్గొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తలంబ్రాల కలయిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో శ్రీరాములోరి 25 కలశాల' స్వర్ణాభిషేకం.**



ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రాచలంలో బుధవారం వేకువ జామునే భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. "జై శ్రీరామ్" అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోగా...శ్రీ రాములోరి కి అత్యంత వైభవంగా 25 వెండి, బంగారు కలశాలతో మహా అబిషేకం నిర్వహించారు. మంగళ ధ్వనులు, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభిషేక ద్రవ్యాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల పవిత్ర తీర్థాలతో నింపిన 25 కలశాలతో స్వామివారిని అభిషేకించారు. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అభిషేకానంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ విశేష పూజలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఆడపిల్లకు చదువే అసలైన ఆయుధం

## దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు

### గుర్రంపోడులో ఘనంగా 'లాస్ట్ రివిజన్' స్టడీ మెటీరియల్ పంపిణీ



**గుర్రంపోడు, మార్చి 4(జనంసాక్షి)** ప్రతి ఆడపిల్లకు చదువే ఒక శక్తివంతమైన ఆయుధం కావాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో పదవ తరగతి విద్యార్థులకు పి.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'లాస్ట్ రివిజన్ బుక్' స్టడీ మెటీరియల్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో, ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయి విషయ నిపుణులతో నాణ్యమైన మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు ధనికుడు కాకపోయినా, ఎటువంటి ఉద్యోగం లేకపోయినా.. కేవలం తన ఆశయమే లక్ష్యంగా నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వంటి

మిగతా 6లో

# కొలతలు తారుమారు

○నిర్మాణ పనులపై గ్రామస్థుల ఆగ్రహం ○అసలు ఏమి జరుగుతుంది?







**అన్నపురెడ్డిపల్లి మార్చి 4 (జనంసాక్షి)** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ రోడ్ నిర్మాణ పనుల్లో కొలతలను తారుమారు చేసి పనులు చేపట్టడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం వల్ల పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ ప్రజల వివరాల ప్రకారం,రహదారి వెడల్పు, పొడవు విషయంలో అధికారిక అంచనాలు ఒకలా ఉండగా, ప్రస్తుత నిర్మాణంలో కొలతలు తగ్గించి పనులు కొనసాగిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గ్రామం లో కొంత ప్రాంతంలో రోడ్డు వెడల్పు తగ్గించడం గ్రామ శివారులో రోడ్డు కొలతలు మరో విధంగా ఉండటం విచిత్రంగా వుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత

మిగతా 2లో



# ప్రజాస్పందనకు స్పందించిన మధిర మున్సిపల్ చైర్ పర్సన్

## మధిర ట్యాంక్బండ్ పై మరమ్మత్తు పనులు ప్రారంభం

**మధిర, మార్చి 04 (జనంసాక్షి) :**
ఇటీవల ట్యాంకుబండపై అపరిశుభ్రత, చుట్టూ పెరిగి ఉన్న కంపచెట్లు, పిల్లల ఆట స్థలాల వద్ద తగు రక్షణ లేకపోవడం, స్విమ్మింగ్ ఘాట్ వద్ద నిరుపయోగంగా ఉన్న బాత్రూంలను పునరుద్ధరించి ఉపయోగం లోకి తేవడం లాంటి సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురాగా మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత వెంటనే స్పందించి ఉదయమే ట్యాంకుబండును మున్సిపల్ కమిషనర్ సంపత్, 10 వార్డ్ కౌన్సిలర్ బోడేపూడి రేవతి, మున్సిపల్ సిబ్బందితో కలిసి సందర్శించి పరిశుభ్ర చర్యలు చేపట్టారు. ట్యాంకుబండు పైన ఉన్న చెత్తను తొలగించి కంప చెట్లను తొలగించే కార్యక్రమం వెంటనే డ్రైవ్ చేపట్టారు. పిల్లల ఆట స్థలం వద్ద తగు రక్షణ కోసం ముందుగా ఇసుకను అక్కడ నింపుతామన్నారు. ట్యాంకుబండ్ పరిరక్షణ చూసేందుకు ప్రత్యేకంగా ఒక మనిషిని ఏర్పాటు చేస్తామన్నారు. స్విమ్మింగ్ ఘాటు వద్ద నిరుపయోగంగా ఉన్న బాత్రూంలను రెండు రోజుల్లోనే ఉపయోగం లోకి తెచ్చే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ట్యాంక్ బండ్ పై ఉన్న స్విమ్మింగ్ వాకర్ సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అన్ని రకాల చర్యలు చేపట్టి ట్యాంక్ బండ్ పై సందర్శించే వారికి ఎటువంటి ఇబ్బంది కలక్కుండా ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో సామినేని రామనాథం, రాజేంద్ర, రావూరి రామారావు, రంగశెట్టి శ్రీను, వనమా కిరణ్, కర్నాటి చిన్న శ్రీను లతో పాటు స్విమ్మర్సు, వాకర్సు పాల్గొన్నారు.




# కొలతలు తారుమారు

## నిర్మాణ పనులపై గ్రామస్థుల ఆగ్రహం అసలు ఏమి జరుగుతుంది?

అధికారులను పలుమార్లు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో వెడల్పు తగ్గిస్తే రానున్న రోజుల్లో రద్దీ పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని గ్రామ ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తే కొందరు కాంట్రాక్టర్లు వారికి ఇష్టం వచ్చిన కొలతలతో రోడ్డు పనులు చేయడం దురదృష్టకరం అని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను సాంకేతిక నిపుణులతో పరిశీలించి సరైన కొలతలతో పునర్నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనీ రోడ్డు అంత ఒకే విధమైన కొలతలు ఉండే విధంగా నిర్మాణాలు చేసే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# 22వ వార్డులో జేసీబీతో చెత్త తొలగింపు

భువనగిరి పట్టణం, మార్చి 4 (జనం సాక్షి)
భువనగిరి పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని న్యూ రాం నగర్ ప్రాంతంలో చాలా రోజులుగా చెట్లు పెరిగి, చెత్త పేరుకుపోయి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యకు చెక్ పెట్టారు. 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ చొరవతో మునిసిపల్ సిబ్బంది సహకారంతో జేసీబీ యంత్రాన్ని వినియోగించి విస్తృతంగా శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. చెత్త, పొదలు, మురికి పేరుకుపోవడం వల్ల దోమలు, విషపూరిత జీవుల బెడద పెరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించిన కౌన్సిలర్ వెంటనే అధికారులతో మాట్లాడి క్లీనింగ్ డ్రైవ్ నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం మరియు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వార్డు అభివృద్ధి కోసం నిరంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యతో స్థానికులు ఉపశమనం పొందుతూ కౌన్సిలర్కు కృతజ్ఞతలు తెలిపారు.





# నర్సయ్య గూడెం అంగన్వాడీ కేంద్రంలో ఏఎల్ఎంఎస్ సి కమిటీ సమావేశం

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
మున్సిపాలిటీ పరిధిలో నరసయ్య గూడెం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 5వ వార్డు కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ. అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాలను గర్భిణీ స్త్రీలు, బాలింతలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ విజయ, ఆశా వర్కర్ రమణ, వివో కార్యదర్శి అనూష, వివో కోశాధికారి శిరీష, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన సర్పంచ్

వలిగొండ ,మార్చి 04( జనంసాక్షి)
మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ పృధ్వి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలే పల్లి లింగస్వామి, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్

**నూతనకల్ మార్చి 4 ( జనంసాక్షి )**
మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు దేవిరెడ్డి మల్లారెడ్డి తండ్రి మారారెడ్డి, రామలింగాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు మూరగుండ్ల సైదులు తండ్రి చంద్రయ్య ఇటీవల మృతి చెందారు బుధవారం మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన బిఆర్ఎస్వి నూతనకల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్వాల నరేష్ ను పరామర్శించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలు గౌడ్, సర్పంచులు మహేశ్వరం మల్లికార్జున్, గాడుదుల లింగరాజు యాదవ్, గుగులోత్ కోటేష్ నాయక్, చురుకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమల్ రావు, చూడి లింగారెడ్డి, నర్సింగ్ నాయక్, బాబు, మొగుళ్ళ వెంకన్న గౌడ్, రేసు వెంకటేశ్వర్లు, మహేష్ ఉప్పుల వీరుయాదవ్ తదితరులు ఉన్నారు.



# ఘనంగా శ్రీవేణుగోపాల స్వామి కళ్యాణం

**కనగల్లు, మార్చి 4 (జనంసాక్షి)**
కనగల్లు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి జాతర మహోత్సవాల లో భాగంగా బుధవారం దేవతామూర్తుల కళ్యాణానికి ఆలయ ధర్మకర్తలు మేల వాయిద్యాల నడుమ శాస్త్ర యుక్త మంత్రోచనాల తో ఎదుర్కోల్లు నిర్వహించి అనంతరం తలంబ్రాలు సమర్పించి సంప్రదాయపద్ధంగా జరుపగా భక్తులు శ్రీవారి కళ్యాణాన్ని ఆనందంగా తిలకించారు. జాతర ఉత్సవాల సందర్భంగా గ్రామంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, మాజీ జెడ్పిటిసిచిట్ల వెంకటేశం, మాజీ సర్పంచులు నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, చిట్ల లింగయ్య, ఉప సర్పంచ్ మండలి చంద్రయ్య, ఆలయ వంశంపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ అక్కినపల్లి శ్రీనివాసరావు, అక్కినపల్లి తిరుమల నాథ్, అర్చకులు పిల్లి గుంతల వెంకటాచార్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రంలో నాణ్యమైన భోజనం అందించాలి

## అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్లు





**హుజూర్నగర్, (జనంసాక్షి):** అంగన్వాడి కేంద్రంలో నాణ్యమైన భోజనం అందించాలని 25వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాం నగర్ 25వ వార్డులోని అంగన్వాడి కేంద్రాన్ని 25 వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, మూడో వార్డు కౌన్సిలర్ , 25వార్డ్ కోఆర్డినేటర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు, గర్భిణీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, నాణ్య మైన అన్నం పెట్టాలని, పాల ప్యాకెట్ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం శాశ్వత కేంద్రం ఏర్పాటు చేయాలని వారు స్థానిక కౌన్సిలర్ సంపత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగానే, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని, స్టోర్ రూమ్ లో చిన్న పిల్లలకు, గర్భిణీలకు ఇచ్చే గుడ్లను, బాలామృతం ప్యాకెట్స్ ను వారు పరిశీలించారు. అక్కడ సదుపాయాలకు సంబంధించిన విషయాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని, ఈ సందర్భంగా రోజి అనే పాపతో అక్షర అభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్ర నిర్వాహకురాలు ఎండి నజీమా బేగం కౌన్సిలర్లను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో సహారాబాను, అంగన్వాడీ ఆయా వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాల్లవుల వీరయ్య, తోట ఉపేందర్, ములకలపల్లి వెంకటేష్, మిాసాల గోపి, తమ్మిశెట్టి నరసింహారావు, ములకలపల్లి శ్రీను, తురక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# భీమనపల్లి రైతు వేదికలో సమీకృత వ్యవసాయ శిక్షణ

**భూదాన్ పోచంపల్లి, మార్చి 4 (జనంసాక్షి):**
తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని బీమనపల్లి రైతు వేదికలో సమీకృత వ్యవసాయం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం తొలి రోజు విజయవంతంగా నిర్వహించారు. సుమారు 40 మంది రైతులు పాల్గొని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పొందారు. పంటలతో పాటు పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని నిపుణులు వివరించారు. వ్యవసాయ అధికారులు పామ్ ఆయిల్ సాగు, వరిలో చీడపీడల నివారణ, సేంద్రీయ వ్యవసాయం అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్, మండల వ్యవసాయ అధికారి ఏ. శైలజ, భీమనపల్లి సర్పంచ్ వరలక్ష్మి పాండు, కనుముక్కుల సర్పంచ్ శంకరయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు టీ. స్వేత, బి. ప్రియాంక, జె. నరేష్, కె. రాజేష్, డి. పవిత్రన్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఘనంగా ఫన్ ఫెస్ట్

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ఖమ్మం పట్టణంలోని స్థానిక విద్యాసంస్థ త్రివేణి టాలెంట్ స్కూల్లో 6వ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థులకు ఫన్ ఫెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ గమ్యం చేరే వరకూ సోషల్ మీడియా కి దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకుని అది నెరవేరే వరకూ విశ్రమించకుండా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ పిల్లలందరూ వ్యక్తిగత క్రమశిక్షణ కలిగిఉండాలని అప్పుడే వారు కోరుకున్న గమ్యాన్ని చేరుకుంటారని, పిల్లలకి ఈ ఫన్ ఫెస్ట్ లాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ వాళ్లలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం లో త్రివేణి ఎప్పుడూ ముందు ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులకు అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డులు, అత్యుత్తమ హాజరు కలిగిన విద్యార్థులకు మమెంటోస్ ఇచ్చి అభినందించారు. తదనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య గీతాలు ఆహుతులను అలరించాయి. పిల్లల ప్రదర్శనలను తిలకించి తల్లిదండ్రులు



హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, సి ఓ అడ్మిన్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న క్యాంపస్ ఇంచార్జ చార్లెస్ మరియు ట్రాన్స్పోర్ట్ ఇంచార్జి సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వాసవిక్లబ్, వాసవి వనితక్లబ్ లెజెండ్ ఆధ్వర్యంలో హోళీ వేడుకలు



**హుజూర్ నగర్, (జనంసాక్షి):**
పట్టణంలోని స్వర్ణవేదిక ఫంక్షన్ హాల్ లో బుదవారం వాసవిక్లబ్ , వాసవీ వనితక్లబ్ లెజండ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ హోలీ సంబరాలలో ముఖ్య అతిథులుగా హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ , వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ , కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లి రవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆర్ఎస్ ఉప్పల రామ్ నరేష్, జెడ్ సి కరాలపాటి పాపారావు, అధ్యక్షులు వీరవెల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటేశ్వర్లు, కోశాధికారి కాళంగి నరసింహారావు, వాసవి వనిత క్లబ్ లెజెండ్ జెడ్ సి పోలిశెట్టి ఝాన్సీ వెంకటేశ్వర్లు, అధ్యక్షురాలు పెనుగొండ రాజ్యలక్ష్మి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెచ్చ శ్యామల మాధవ్, కోశాధికారి ఆరేటి వెంకట లక్ష్మి, కన్నె గుండ్ల అశోక్, వర్తక సంఘం ప్రెసిడెంట్ నీరుమళ్ళ నరసింహారావు, వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు చేపూరి అనంతరాములు, పెండ్యాల నాని, హరీష్, నరసింహ రావు, సతీష్, చిరంజీవి, కిరణ్ ,చంద్రశేఖర్, శ్రీనివాస్ దయాకర్, వాసవి వనిత క్లబ్ లెజెండ్ కార్యవర్గ సభ్యులు గీత, ప్రవల్లిక, స్రవంతి, మౌనిక, విజయలక్ష్మి, కళ్యాణి, మాధురి, మౌనిక, స్రవంతి, కొత్త కళావతి, వీరవెల్లి పద్మావతి, కాలంగి శ్రీలత, రాధ, శిరీష, భవాని, రాధ లు పాల్గొన్నారు.

# కారేపల్లిలో హెూలీ సందడి

**కారేపల్లి, మార్చి 04 (జనంసాక్షి) :**
కారేపల్లి మండలంలో గ్రామాల్లో హెూలీ వేడుకలు సందడిగా సాగాయి. ప్రభుత్వం హెూలీ సెలవు దినం మంగళవారం ప్రకటించినా ఆ రోజు చంద్రగ్రహణం కావటంతో పండుగ జరపలేదు. మండలంలోని గ్రామాల్లో బుధవారం హెూలీ జరుపుకున్నారు. తండాలు హెూలీ వేడుకలతో సందడి గా మారాయి. కారేపల్లిలో బీసీ కాలనీ యువకులు కారేపల్లి డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా హెూలీ వేడుకను జరిపారు. యువకులు తమ సవాసగాళ్లను ఆటపట్టిస్తూ తలపై కోడి గ్రుడ్లు కొడుతూ, నల్లని తారు అయిల్ పూస్తూ అనందంతో నృత్యాలు చేశారు. వయసు, ఆడమగ, తారతమ్య బేధాలు పక్కన పెట్టి హెూలీ జరుపుకున్నారు.



# సర్పంచ్ తులసీరామ్ కుటుంబానికి భీమా సొమ్ము

## రూ. రెండు లక్షల చెక్ అందజేసిన పోస్టల్ అధికారులు

**కారేపల్లి, మార్చి04(జనంసాక్షి) :**
సింగరేణి మండల పరిధిలోని బోటితండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య తులసీరామ్ ఇటీవల అనారోగ్యంతో మరణిం చారు. గతంలో పోస్ట్ ఆఫీస్ ద్వారా తన పేరు మీద పీఎంజేజేబి వై ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం జరిగింది. ఈ పాలసీ ద్వారా వచ్చిన భీమా మొత్తం రూ. 2 లక్షల కు సంబంధించిన చెక్కును బోటి తండా సర్పంచ్ బాదావత్ మంగీలాల్, జిల్లా పోస్టల్ సూపర్డెంట్ వీరభద్ర స్వామి చేతుల మీదుగా బుధవారం తులసీరామ్ సతీమణి విజయలక్ష్మికు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఓ, ఎంఓలు, ఐపిపిబి మేనేజర్లు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సాయి, పోస్టల్ సిబ్బంది బి రామకృష్ణ, జి శరణ్, జె విజయ్ , యశ్వంత్, జవహర్, నవీన్, ప్రత్యూష , రమ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఉరడీ దంపతులకు ఘన సన్మానం

## ఎల్లప్పుడూ పేదలకు అందుబాటులో ఉంటాం
## సీపీఎం జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్ రెడ్డి



**ఖమ్మం రూరల్, మార్చి 04 (జనంసాక్షి):** ఇటీవల జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో 31 వ వార్డులో ఘన విజయం సాధించిన సీపీఎం కౌన్సిలర్ ఉరడీ హైమావతి,సీపీఎం జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్ రెడ్డి దంపతులను బుధవారం ఆదిత్య నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...హైమావతి గెలుపులో కీలక పాత్ర పోషించిన ఆదిత్య నగర్ కాలనీవాసులకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.కాలనీ వాసులకు ఎల్లవేళలా ఏ సమస్య వచ్చినా సీపీఎం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.తన ఊపిరి ఉన్నంతవరకు పేద ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య నగర్ వాసులు నారపాటి రమేష్,బీరెల్లి అశోక్ రెడ్డి,శంకర్,ఫణి,రాజు,మురళి,కాలనీ మహిళలు నారపాటి నాగేంద్ర,లక్ష్మి,బీరెల్లి రేణుక,అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# గురుస్వాముల ఆధ్వర్యంలో మహా అన్నదానం





**మణుగూరు, మార్చి 04 (జనంసాక్షి ):** స్వామియే శరణం అయ్యప్ప అనే పదం మనసు నుండి వెలువడే ఆ మంత్రం అయ్యప్ప మాలదారుల మదినిండా భక్తిని నింపుతుందని మణుగూరు మండల గురుస్వాములు సత్తు యాకయ్య అన్నారు. బుధవారం అయ్యప్ప స్వామి పీఠాల గురుస్వాములు, కమలాపురం అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. . అఖిలాండకోటి బ్రహ్మండ నాయకుడైన శ్రీ అయ్యప్ప స్వామికి ముందుగా అర్చకులు గణపతి మంత్రోచ్చరణతో అయ్యప్ప స్వామి వారి విగ్రహానికి ప్రతిష్టించి పుష్పాలతో అభిషేకం చేసి పూల మాల వేసి కన్నుల పండువగా అలంకార ప్రియుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశ్రీ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం జన్మదినం సందర్భంగా కమలాపురం గ్రామంలోని రామాలయంలో అన్నదానం చేశామని తెలిపారు. మణుగూరు మండలంలోని అయ్యప్పస్వామి పీఠాల గురుస్వాముల సహకారంతో ప్రతి నెలలో వచ్చే అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం రోజున వివిధ పీఠాల్లో, మహా అన్నదానం చేయడం జరుగుతుందని గురుస్వాములు తెలిపారు. అన్నదాన వడ్డించిన వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్పస్వామి మాలలు ధరించినప్పుడే అయ్యప్ప మహిమలు గుర్తు చేసుకుంటున్నామని అలా కాకుండా ప్రతి నెలలో వచ్చే ఉత్తరా నక్షత్రం అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రంగా భావించి ప్రతి రోజు అయ్యప్పస్వామిని తలుచుకునే విధంగా మండలంలోని పీఠాల గురుస్వాములు సంకల్పించి మహా అన్న ప్రసాద కార్య క్రమాలు నిర్వరామంగా కొనసాగిస్తున్నా మని తెలిపారు. అయ్యప్పస్వామి వారి మహా ప్రసాదం స్వీకరించిన భక్తులకు అయ్యప్ప దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మణుగూరు మండలంలోని గురు స్వాములు కమలాపురం గ్రామ ప్రజలు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# యాక్షన్ ప్లాన్ అమలుతో ఉత్తమ ఫలితాలు సాధించాలి:ఎంఈఓ శ్రీనయ్య



**హాలియా మార్చి 04 జనంసాక్షి** పదో తరగతిలో ప్రభుత్వనీ నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ అమలుపరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అనుముల మండల విద్యాధికారి శ్రీనయ్య పేర్కొన్నారు. బుధవారం పులిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్ రికార్డ్స్ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది ఫలితాల్లో అనుముల మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉదయం ,సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రికార్డు పరిశీలనలో జిహెచ్ఎంలు శేషు, శైలజ ఉపాధ్యాయులు అంజయ్య, రమేష్ స్థానిక ఉపాధ్యాయులు నరసింహ చారి, రవీంద్ర చారి, కొల్లు శ్రీనివాస్ రెడ్డి , రవీందర్ ఉమా రెడ్డి సంధ్య ,వినోద తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## ఆర్యవైశ్య యువజన జిల్లా సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల పంపిణీ



**సూర్యాపేట (జనంసాక్షి)** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ట్రెజరర్ చల్లా లక్ష్మీకాంత్, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు బొమ్మిడి అశోక్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ 2లో పదవ తరగతి విద్యార్థులకు యామ సంతోష్, శ్రీరంగం రాము పరీక్ష ప్యాడ్లను అందజేశారు.ఈ సందర్భంగా చల్లా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంను సాధించే విద్యార్థికి 5116 రూపాయల నగదు బహుమతిని అందజేస్తానని ప్రకటించారు.అనంతరం బొమ్మిడి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు.ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు.విద్యతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.యామ సంతోష్, శ్రీరంగం రాము మాట్లాడుతూ రానున్న పదవ తరగతి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతను సాధించాలని అన్నారు.ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ ప్రారంభించిన
## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్




**కల్లూరు మార్చి 04(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పేర్కొన్నారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని మూడు నాలుగు వార్డుల లో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, పాలకవర్గం కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం పర్యటించారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు సాగర్ కెనాల్ పక్కనుండి రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సాగర్ కెనాల్ పక్కన డబుల్ బెడ్ రూమ్ ల వరకు ఐరన్ జాలితోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరడం జరిగింది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఈనేపద్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా డబుల్ బెడ్ రూమ్ సమీపంలో సాగర్ కెనాల్ పక్కన ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా ఎన్ ఎస్ పి లోని చౌదరి హోటల్ నిర్వాహకులు చల్ల గుళ్ళ వెంకటేశ్వరరావు (చౌదరి బాబు) ఆర్థిక సౌజన్యంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇదే సందర్భంలో కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, పలువురు కౌన్సిలర్లు పార్టీ శ్రేణులతో కలిసి సాగర్ కెనాల్ పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ప్రారంభించారు.ప్రమాదాలను నివారించేందుకు డబుల్ బెడ్ రూమ్ సమీపంలో నాగార్జునసాగర్ కెనాలపై సిమెంట్ పోల్స్ ఐరన్ జాలితో ఫెన్సింగ్ఏర్పాటుకు సహకరించిన దాత చౌదరిబాబును డాక్టర్ దయానంద్ అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దయానంద్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు, పలు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో గుర్తించిన ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పాలకవర్గానికి సూచించారు. తొలుత ఎన్ ఎస్ పి లోని చౌదరి హోటల్ వద్ద హోటల్ నిర్వాహకులు చౌదరి బాబు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షులు ఎస్కే ఉస్మాన్, చౌదరి బాబు, నోటి కృష్ణారెడ్డి, దామాల రాజు, కాటేపల్లి కిరణ్ కుమార్ ధరావత్ రవికుమార్, ముత్తమాల రాందాస్ శీలం కృష్ణారెడ్డి,పలువురు పార్టీ కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కూల్చిన చోటే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి

**కూల్చిన ఇళ్ళకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలి**

**వెలుగమట్ల నిర్వాసితులు కలెక్టర్ తో భేటీ సందర్భంగా సీపీఎం నాయకులు వై విక్రమ్**



**ఖమ్మం, (జనంసాక్షి):**
వెలుగు మట్ల భూ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని, కూల్చిన చోటే ప్రభుత్వం బాధితులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని, కూల్చిన ఇళ్లకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసురావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వెలగమట్ల ఇళ్ల నిర్వాసితులు కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసురావు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలకు పైగా వెలుగుమట్లలో ఇళ్లు నిర్మించుకొని 650 మంది పైగా పేద కుటుంబాలు నివసిస్తున్నారని, ఆకస్మికంగా, తెల్లవారుజామున ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పేదల గుడిసెలపై 2000 మంది పైగా పోలీసులు మోహరించి ఖాళీ చేయించడం దుర్మార్గమని విమర్శించారు. యుద్ధ వాతావరణన్ని సృష్టించి కోట్ల రూపాయల ఆస్తిని నష్టం చేయడం దారుణం అని, ఈ చర్య వెనక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో ప్రభుత్వం జిల్లాలోని ముగ్గురు మంత్రులు తెలియజేయాల్సింది అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో భూదాన్ 62 ఎకరాలు ఉందని అనేక సందర్భాల్లో అధికారులు,, మీడియా సంస్థలు ప్రకటిస్తూ వచ్చాయని ప్రస్తుతం సమస్య 31ఎకరాలలోనిది అని, మిగతా 31 ఎకరాల భూమి సంగతి ఏమిటని వారు ప్రశ్నించారు. కేవలం ఆసరా లేని పేదల పైన ప్రభుత్వం ప్రతాపం చూపుతూ, రియల్ ఎస్టేట్, వ్యాపారులకు, వివిధ సంస్థలకు, ప్రయోజనం చేసేలా వ్యవహరించడం దారుణమని వారు విమర్శించారు. వారం రోజుల్లో బాధితుల సమస్యను సక్రమంగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిర్వాసితులు వుంటున్న అంబేద్కర్ భవన్, టీటీడీసీ బిల్డింగ్ లోనూ కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో పది రోజుల్లో వెలగమట్ల నిర్వాసితులకు తగిన విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెరుగు సత్యనారాయణ , బండారు రమేష్, మీరా సాహెబ్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, భుక్యా శ్రీనువాసురావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి నాగ సులోచన, మెహెరిన్నీసా బేగం, భాగం అజిత, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నూతనకల్ మార్చి 4 ( జనంసాక్షి)**
తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నకిరెకంటి వెంకన్న బండపల్లి సాగర్ గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ లింగాల రామచంద్రయ్య గొడిశాల లింగన్న గౌడ్ మంగళపల్లి నారాయణ చిర్ర శ్రీనాథ్ గణేష్ మహేష్ నవిలే ఉపేందర్ తదితరులు ఉన్నారు.



## నూతన ఎంఈఓ కు ఘనంగా సన్మానించిన పిఆర్టియు జనరల్ సెక్రటరీ మాస బాలరాజు ఆధ్వర్యంలో

**మర్రిగూడ, మార్చ్ 4 (జనంసాక్షి)**
నూతన మర్రిగూడ ఎంఈఓ కు ఘనంగా సన్మానం. మర్రిగూడ ఎంఈఓ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శారదా కు పిఆర్టియు జనరల్ సెక్రటరీ మాస బాలరాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో హైమావతి, రఘు, శోభ బిక్షము, స్వరాజ్యం అంజయ్య, సిరాజ్, గంగభవాని,లింగస్వామి, రాజు పాల్గొన్నారు.

## జువారీ సిమెంట్ ప్లాంట్‌లో జాతీయ భద్రతా వారోత్సవ ప్రారంభ వేడుకలు



**చింతలపాలెం (జనంసాక్షి)**
55వ జాతీయ భద్రతా వారోత్సవ ప్రారంభ వేడుకలు బుధవారం రోజు చింతలపాలెం మండలం,దొండపాడు లోని జువారీ సిమెంట్ ప్లాంట్ లో ఘనంగా నిర్వహించారు. ప్లాంట్ హెడ్ జి.యన్.బి రావు జెండా ఎగుర వేసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రత యొక్క ముఖ్య ఉద్దేశాన్ని కార్మికులకు ,ఉద్యోగులకు తెలియచేసి ,విజేతలకు బహు మతులు అందచేశారు. ప్లాంట్ భద్రతా అధికారి జి.కిషోర్,ఈ భద్రతా వారోత్సవాల లో ఏర్పాటు చేసిన పలు పోటీల వివరాలను తెలియచేసి అందరిని పాల్గొనవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఆఫీసర్లు,కార్మికులు పాల్గొన్నారు.

## యరుగండ్లపల్లి లో ఘనంగా హోలీ సంబరాలు

**మర్రిగూడ, మార్చ్ 4 (జనంసాక్షి)**
మర్రిగూడ మండలం యరుగండ్లపల్లిలో గ్రామంలో సర్పంచ్ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలను ఉత్సాహభరితంగా జరిగాయి. యువకులు రంగులు చల్లుకుంటూ, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదాయబద్ధంగా హోలీ రంగుల పండుగను జరుపుకున్నారు.





కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గన్యా నాయక్ తండాలో రామావత్ తుకారామ్ నాయక్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారామ్ నాయక్ మాట్లాడుతూ గన్యా నాయక్ తండ, దంజిలాల్ తండా రెండు తండాల ప్రజలు కలిసి ఐదేళ్లకోసారి హోలీ వేడుకలు నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే హోలీ వేడుకలు చిన్నా పెద్దా అంతా కలిసి హోలీ ఆనందోత్సాహాల్లో తేలిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో రామావత్ తుకారం భానోత్ అఖిల్ నాయక్ రామావత్ రతన్లాల్ రామావత్ జగన్ నాయక్ రామావత్ లస్కర్ రామావత్ కోటియా గిరియా రామావత్ అచ్చాలి గిరిని రామావత్ హాతిరాం బావజీ రామావత్ ధనుకోటి రామావత్ రాములు రామావత్ జగన్ నాయక్ రామావత్ శంకర్ నాయక్ గోపాల్ వర్మ బానోత్ బద్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి, జనంసాక్షి.**

## ఐటీసీ అనుమతి ఒకచోట- కర్రను కట్ చేసే పొలం మరొకచోట!

**○ప్రెస్మీట్లో వెల్లడించిన బూసిరెడ్డి శంకర్ రెడ్డి**

**బూర్గంపహాడ్ మార్చి 03 (జనంసాక్షి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటిసి కి దరఖాస్తులు చేసే పొలం ఒకటైతే అనుమతులు తర్వాత కర్రను కట్ చేసే పొలం మరొకచోట ఉందని బూసిరెడ్డి శంకర్ రెడ్డి మంగళవారం బూర్గుంపహాడ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన ప్రెస్మీట్లో వెల్లడించారు. ఐటీసీ రా మెటీరియల్ విభాగం అధికారులను మోసగించి అక్రమ పీ ఓ పొందడమే కాకుండా, ఐటీసీ అధికారుల అనుమతితోనే తాను పొలాల్లో కర్ర నరికి ఐటిసికి సరఫరా చేస్తున్నానని గుత్తేదారు జవాబు ఇచ్చారని తెలిపారు. ఐటీసీ అధికారులు కూడా ధరఖాస్తు లను పరిశీలించకండానే అనుమతులిస్తూ, కలప వస్తే చాలు అన్నట్లు అక్రమాలకు పాల్పడే గుత్తేదారులను ఐ టి సి రా మెటీరియల్స్ (కలప విభాగం) అధికారులు ప్రోత్సహిస్తున్నారని బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆరోపించారు. ఇదిలా ఉండగా సౌమ్య అను యువతి నాగనేని ప్రోలు శివారులో ఉన్న తన రెండు ఎకరాల పొలం లో ఉన్న కలపను (ఆ పొలంలో జామాయిల్ పంట లేనే లేదు) ఐటిసికి అమ్ముకోవడానికని గుత్తేదారు మద్ది బక్కారెడ్డి ద్వారా ఐటిసి రా మెటీరియల్స్ విభాగం నుండి అనుమతుల కోసం ధరఖాస్తు చేశారు. ఆ పొలంలో జామాయిల్ వేశారా లేదా అని పరిశీలించకండానే ఐటీసీ అనుమతి మంజూరు చేసింది. కానీ, అనుమతి పొందిన తరువాత జామాయిల్ కర్ర నరికింది మాత్రం నాకు చెందిన సారపాక శివారు పొలం నుండి అని, ఇదేంటి అని గుత్తేదారు మద్ది భక్కారెడ్డిని ప్రశ్నించగా, ఐటిసి రా మెటీరియల్స్ అధికారుల ప్రోద్భలంతోనే తాను వేరే పొలం నుండి కట్ చేస్తున్నానని జవాబు చెప్పి, నేను వద్దని చెప్పినా వినకుండా నాగినేనిప్రోలుకు చెందిన హంస బూసిరెడ్డి వెంకట్రామిరెడ్డి భార్య, అమె మరిది సునీల్ రెడ్డి, ఆమె కూతురు సౌమ్య లతో కుమ్మక్కై కర్రను నరికి అమ్ముకున్నారని బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆరోపించారు. అయితే దీనిపై బూర్గంపహాడ్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశానని, ఎస్ ఐ కేసు నమోదు చేసి అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ఐటిసి రామెటీరియల్ అధికారియైన శ్రీధర్ దృష్టికి, ఐటీసీ రామెటీరియల్స్ విభాగం జనరల్ మేనేజరు అమిత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మరి అక్రమ అనుమతులు పొంది, అక్రమాలకు పాల్పడుతున్న గుత్తేదారు మద్ది బక్కారెడ్డి పై చర్యలు తీసుకుంటారా? లేదా.. ఇటువంటి అక్రమార్కులను ప్రోత్సహిస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని బూసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు.



# బాల్య వివాహాలు లేని మండలంగా మాడుగులపల్లిని తీర్చిదిద్దుదాం

## మండల స్థాయి అధికారుల పిలుపు



**మాడుగులపల్లి, మార్చి 4 (జనంసాక్షి):** మాడుగులపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు మండలంలో బాల్య వివాహాల నిర్మూలన, శిశువుల అక్రమ రవాణా, అక్రమ దత్తతల నివారణే ధ్యేయంగా ఈ సమావేశం జరిగింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఈ సందర్భంగా సీడీపీఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. పిల్లలను అక్రమంగా దత్తత ఇవ్వడం చట్టరీత్యా నేరమని, దీనిపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని కోరారు స్థానిక పోలీస్ సిబ్బంది ఖాదిర్ భాష మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లల అమ్మకాలు లేదా అక్రమ దత్తతలపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, గ్రామ స్థాయిలోని పోలీస్ సిబ్బందిని ఈ విషయంలో అప్రమత్తం చేశామని తెలిపారు. ఎంపీడీవో వంశీధర్, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీల ద్వారా రెవెన్యూ యంత్రాంగం ద్వారా గ్రామాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మాడుగులపల్లి మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంగీత, ఏపీఎం మధు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణి, ఏపీఓ శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్లు లక్ష్మి, నాగమణి, పోషణ అభియాన్ ప్రతినిధి రమణి, అంగన్వాడీ టీచర్లు సుశీల, మరియమ్మ, సాయమ్మ, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



### గారకంటపాలెం అంగన్‌వాడీ కమిటీ అధ్యక్షుడిగా

# పెద్ది కృపాకర్ ఎన్నిక

**మాడుగులపల్లి, మార్చ్ 4 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని గారకంటపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం నూతన యాజమాన్య కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో కమిటీ అధ్యక్షుడిగా పెద్ది కృపాకర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులుగా మంజుల, రమాదేవి, మాధవి, లక్ష్మి, ఫరోజుద్దీన్, మాధవి, నాగమ్మ, శివలీల ఎన్నికయ్యారు. అంగన్‌వాడీ కేంద్రం కన్వీనర్‌గా శోభారాణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి సన్రాల జానకి రాములు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పెద్ది కృపాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు చిన్నపిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తామని, కేంద్రం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# గిరిజన తండాల్లో అంబరాన్నంటిన హోలీ సంబరాలు



**కొండమల్లేపల్లి, మార్చి 4 (జనంసాక్షి):** హోలీ గిరిజనులకు ప్రత్యేకమైన పండుగ ఎక్కడున్నా సరే హోలీ రోజు ఊళ్లకు వెల్లి హోలీ వేడుకలు చేసుకుంటారు. హోలీ పండుగ గిరిజనుల సాంప్రదాయాలకు నిలువుటద్దం. అయిదు ఏళ్లకు ఒకసారి సాంప్రదాయకంగా జరుపుకునే హోలీ వేడుకలు మండలంలోని గన్యా నాయక్ తండా, దంజిలాల్ తాండలలో పాంచ్ నంగేరి హోలీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండు తండాల ప్రజలు సుమారు మూడువేల మంది కలిసి ఒకే ప్రాంతంలోని తండాలలో హోలీ ఉత్సవాలు ఎంతో వైభవంగా చేశారు. మూడు రోజుల పాటు జరిగే హోలీ వేడుకలు చిన్నా పెద్దా అంతా కలిసి హోలీ ఆనందోత్సాహాల్లో తేలిపోయారు. అనంతరం బుధవారం తెల్లవారు జామున కామదహనం నిర్వహించారు. అంతకు ముందు రోజు రాత్రి తండాలలోని ప్రతి ఇంటి నుంచి కట్టెలు తీసుకొచ్చి వాటిని కామదహనం చేసే చోట కుప్పగా పేర్చి కుల పెద్దలు ఈ కుప్ప చుట్టూ తిరిగి పూజలు చేస్తారు. తర్వాత కామదహనం చేస్తారు. తండాలో పుట్టిన మగ పిల్లలను కామదహనం చేసే దగ్గరకు తీసుకొచ్చి కాముడి ఆశీర్వాదం పొందుతారు. పిల్లలకు బొట్టుపెట్టించి ఇళ్లకు తీసుకెళ్లారు. గురువారం రోజు రంగులు చల్లుకునే కార్యక్రమంతో పాటు విందు భోజనాలు ఉంటాయని హోలీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామావత్ కొట్య గేర్యా, రామావత్ అచ్చాలి గేరని, రవి బావోజీ, హాతీరామ్ బావోజీ, దంజిలాల్ తండా సర్పంచ్ రామావత్ రాము నాయక్, గన్యా నాయక్ తండా సర్పంచ్ రామావత్ గోజీ, మాజీ సర్పంచులు రామావత్ శ్రీను నాయక్, రామావత్ భీమ్ సింగ్, రామావత్ రాములు, మాజీ ఎంపిటిసీ రామావత్ జగన్ నాయక్, రామావత్ లస్కర్ నాయక్, రామావత్ రతన్ లాల్, రాజునాయక్, రామావత్ తుకారం నాయక్, కిషన్ నాయక్, రామావత్ కృష్ణ, రామావత్ రాజు నాయక్, రామావత్ రాము నాయక్, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఆడపిల్లకు చదువే అసలైన ఆయుధం
### దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు

జిల్లాల్లో వేలాది మంది విద్యార్థులకు తోడ్పా టునందించడం గర్వకారణమని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ విజయశ్రీ, అఖిల భారత విద్యార్థి సమైక్య మాజీ జిల్లా అధ్యక్షులు నలపరాజు సతీష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దంజిలాల్ తండాలో సర్పంచ్ రమావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాము నాయక్ మాట్లాడుతూ గన్యా నాయక్ తండ, దంజిలాల్ తండా రెండు తండాల ప్రజలు కలిసి ఐదేళ్లకోసారి హోలీ వేడుకలు నిర్వహిస్తా మన్నారు. మూడు రోజుల పాటు జరిగే హోలీ వేడుకలు చిన్నా పెద్దా అంతా కలిసి హోలీ ఆనందోత్సాహాల్లో తేలిపోతారన్నారు. అనంతరం బుధవారం తెల్లవారు జామున కామదహనం నిర్వహించారని అంతకు ముందు రోజు రాత్రి తండాలలోని ప్రతి ఇంటి నుంచి కట్టెలు తీసుకొచ్చి వాటిని కామదహనం చేసే చోట కుప్పగా పేర్చి కుల పెద్దలు ఈ కుప్ప చుట్టూ తిరిగి పూజలు చేస్తారన్నారు. తర్వాత కామదహనం చేస్తారని తెలిపారు. తండాలో పుట్టిన మగ పిల్లలను కామదహనం చేసే దగ్గరకు తీసుకొచ్చి కాముడి ఆశీర్వాదం పొందుతారని పిల్లలకు బొట్టుపెట్టించి ఇళ్లకు తీసుకెళ్లారన్నారు. గురువారం రోజు రంగులు చల్లుకునే కార్యక్రమంతో పాటు విందు భోజనాలు ఉంటాయని సర్పంచ్ రమావతి రాము తెలిపారు.

**కొండమల్లేపల్లి, జనంసాక్షి.**

### వైభవంగా శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవ వేడుకలు



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కుప్పిరెడ్డి గూడెంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి దేవాలయంలో కళ్యాణ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికలపై ఉత్సవ విగ్రహాలతో వేద మంత్రాల నడుమ భక్తుల సమక్షంలో ఈ కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ తల్లిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి. షఫీవుల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ వెంకటి శేఖర్ రెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారుగడ్డలో వైభవంగా కనకదుర్గా దేవి ఆలయ శంకుస్థాపన

## భక్తిశ్రద్ధలతో భూమి పూజ నిర్వహించిన గ్రామస్తులు



**చండూరు, మార్చి 04 (జనంసాక్షి)** చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. గ్రామస్తుల దశాబ్దాల కల సాకారమవుతూ, బుధవారం శ్రీ కనకదుర్గా దేవి నూతన ఆలయ నిర్మాణానికి అత్యంత భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఈ వేడుక శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి మొదలైంది. వేద పండితులు భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు హోమం వంటి ప్రత్యేక క్రతువులను నిర్వహించారు. అనంతరం నిర్ణయించిన శుభ ముహూర్తానికి వేద మంత్రాల సాక్షిగా ఆలయ నిర్మాణానికి పునాది రాయి వేసి, భూమి పూజను సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. ఈ శంకుస్థాపన మహోత్సవంలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో శాంతిసౌఖ్యాలు వర్ధిల్లుతాయని, ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుంకరి చెన్నయ్య, గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు సాపిడి రాములు, పల్లె యాదయ్య, ఇరిగి గురునాదం, బోయపల్లి యాదయ్య, సుంకరి శివ నారి, బోయపల్లి సైదులు, ఇరిగి రాజు, సుంకరి యాదయ్య, పల్లె శ్రీను, పనస రమేష్, పల్లె నరసింహ, కొంపెల్లి అంజన్ కుమార్ వంటి గ్రామ ప్రముఖులు, యువత మరియు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక విలువలను అందించడమే కాకుండా, గ్రామ ఐక్యతకు ఈ ఆలయ నిర్మాణం చిహ్నంగా నిలుస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.